# రాష్ట్ర రక్షణే నందమూరి వారసుల లక్ష్యం



**ఎన్టీఆర్ ప్రాంగణంలో తెదేపా నేతలు లాల్‌జాన్‌బాషా, కోడెల శివప్రసాదరావు, ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు**

న్యూస్‌టుడే, పెదకాకాని

రాష్ట్రంలో అవినీతి పాలన సాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం కోరల నుంచి ప్రజలను కాపాడేందుకు నందమూరి వంశీయులు యువగర్జన ద్వారా ప్రత్యక్ష రాజకీయాల్లో అరంగేట్రం చేస్తున్నట్లు తెదేపా అధికార ప్రతినిధి, మాజీ మంత్రి కోడెల శివప్రసాదరావు, పొలిట్‌బ్యూరో సభ్యులు లాల్‌జాన్ భాష, ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం ఎన్టీఆర్ సభాప్రాంగణంలో వీరు 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ ఇరవై ఆరేళ్ళు ప్రజలకు సేవ చేసిన తెలుగుదేశం పార్టీని మళ్ళీ చూడాలన్న ఆనందాన్ని ప్రజల్లో చూస్తున్నామని నాయకులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని వర్గాల నాయకులు, కార్యకర్తలు ఈ యువగర్జనకు భారీస్థాయిలో తరలివస్తారని కోడెల అన్నారు. 15 లక్షల మందితో బ్రహ్మాండంగా నిర్వహించే ఈ సభకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. అభిమానులు స్వచ్ఛందంగా మేము వస్తామని చెబుతున్నారని, దీని కోసం పార్టీ నాయకులంతా కృషిచేస్తున్నారని లాల్‌జాన్‌బాషా పేర్కొన్నారు. 22 రైళ్ళు, బస్సులు, ట్రాక్టర్లు, లారీలు, కార్లు, ద్విచక్రవాహనాలు ద్వారా ప్రజలను సభావేదికకు చేరేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. విశాలమైన పార్కింగ్ సౌకర్యం కల్పించి ప్రజల రాకకోసం ఎన్టీఆర్ ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దినట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందని ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. అవినీతికి మారుపేరుగా రాజశేఖరరెడ్డి పరిపాలన సాగుతుందని తెదేపా నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. భూములు, ప్రభుత్వ ఆస్తులు, ఖనిజ సంపద, అటవీ సంపద ఇలా అన్ని రకాల ప్రభుత్వ ఆస్తుల్ని కాంగ్రెస్ పార్టీ నాయకులకు అప్పజెప్పి దోచుకునే అవకాశాలను రాజశేఖరరెడ్డి కల్పించారని ధ్వజమెత్తారు.

ప్రభుత్వం చేస్తున్న అవినీతిని ప్రజలు గమనిస్తున్నారని, వచ్చే మూడు నెలల్లో తమ ఓటు తీర్పుతో తగిన బుద్ధి చెబుతారని, కోడెల తెలిపారు. 1983లో కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా తెలుగుదేశం పార్టీని ఎన్టీఆర్ స్థాపించారని, ఆయన ఆశయాలకనుగుణంగా ప్రతి ఒక్క తెలుగుదేశం నాయకులు పనిచేసి ప్రజలకు సేవ చేసేందుకు అవకాశాన్ని అంది పుచ్చుకున్నారన్నారు. సామాజిక సేవే లక్ష్యంగా ఎన్టీఆర్ సినీ ప్రపంచం నుంచి రాజకీయాల్లోకి వచ్చారన్నారు. ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ చిరంజీవి ప్రజా అంకితయాత్ర ద్వారా రాజకీయ లబ్ధి పొందాలనుకోవటం అవివేకమన్నారు. దేశానికి పట్టుకొమ్మలైన యువత ద్వారా రాష్ట్రాన్ని సుభిక్షంలో నడిపేందుకు ఈ యువగర్జన ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. గతంలో తమ పార్టీ రైతుగర్జన, బీసీ సదస్సు వంటి ఎన్నో భారీ సభలను విజయవంతంగా నిర్వహించిందని తెలిపారు. తెలుగుదేశం పార్టీ ఏం చెప్పినా చేసే సత్తా అభిమానులకు ఉందని తెలియజెప్పేందుకు తెలుగుయువత ఆధ్వర్యంలో ఈ యువగర్జన ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు.